# అమానుషం

నేను ఒక కోడిపెట్ట అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

కారణం ఏమిటంటే నేను గుడ్లు పెట్టేది మీ దృష్టికి రాకపోయినా మీకా విషయం తెలుస్తూనే వుంటుంది. గుడ్డు పెట్టేముందు, పెట్టే సమయంలో నేనెంత నరకవేదన అనుభవిస్తున్నానో మీకు తెలియకపోవచ్చు. ప్రతి స్త్రీ ప్రాణికి ప్రసవవేదన అంటే ప్రాణవేదన అని అందరికీ తెలుసు. గుడ్డు పెట్టే సమయంలో ఆ వేదనను నా ముఖంపై ప్రతిబింబింప చేయడం లేదు. ఒకవేళ ఆ వేదనాస్ఫులింగాలు నాకు తెలియకుండానే నా చిన్న ముఖంపై ప్రసరించినా మీకది గోచరం కావడానికి వీలులేదు. ఎందుకంటే స్త్రీ సహజమైన లజ్జతో, నా దైనందిన ప్రసవాలు ఎవరూ చూడకుండా, అతి రహస్యంగానే నేను నిర్వహిస్తున్నాను. కాని ప్రతి ప్రసవం తర్వాత అది నేను సాధించాననే విషయం ఊరి వాళ్లకంతా ఒక ప్రత్యేక రాగంలో మరియు తాళంలో ఘోషింపచేయడానికి నాకు తగిన కారణాలున్నాయి.

నాకిప్పుడు వయస్సెంత అని కచ్చితంగా చెప్పడానికి నాకు తెలియదు. కాస్త నేను గుడ్లు పెట్టడం మొదలుపెట్టి దాదాపు ఒక సంవత్సరం అయింది. కాని ఇన్ని ప్రసవాల తర్వాత గూడా ఎన్నో గుడ్లకు తల్లినైనానే గాని బిడ్డలకు తల్లి కావడంలో వున్న అదృష్టంగాని, స్వంత పిల్లల్ని తన రెక్కల క్రింద సంరక్షిస్తూ నడవడంలో వున్న నిర్వృతి గాని నాకు ఇంతవరకూ లభించలేదు. అలా వుండేటప్పుడు ఇంత ఎక్కువ నొప్పి నేందుకు భరించాలి? ఈ క్రూరుడైన మనుషులు నాకు పుట్టబోయే బిడ్డల్నంతా తిని సర్వనాశనం చేస్తున్నారు గదా. కాని ఒక విషయం ఆలోచిస్తే కోళ్ల ఫారాలలో ఖైదీల్లాగ బ్రతుకుతున్న నా జాతివాళ్లు అనుభవించే దుర్భరమైన జీవితంతో పోలిస్తే నా దౌర్భాగ్యం అంత ఎక్కువేమీ కాదు. ఆ సోదరీమణులు పొదిగి పిల్లల్ని పుట్టించడం సాధ్యంకాదు. వాళ్లగుడ్లు పరిమాణం ఎక్కువగా వుండడంవల్ల ఒక నాటు కోడియైన నేను అనుభవించే ప్రసవవేదన కంటే ఎక్కువ బాధ వాళ్లకు వుండవచ్చు. ఏమైనాగాని, పగలంతా ఊరు మొత్తం తిరగడానికి నాకు పూర్తి స్వాతంత్ర్యం వుంది. పరిగెత్తుతూ, గెంతుతూ వుండే పురుగులను తరిమి నా ముక్కుతో పొడిచి తింటూ వుంటే ఓహ్ ఆ రుచే వేరు.

ఇలా నా గురించే చెబుతుంటే అది కుక్కుట పురాణమవుతుంది. అది మాత్రమే కాదు, చెప్పాల్సిన విషయం మరచిపోతాను.

మూడు రోజులకు ముందు అంటే, సెప్టెంబర్ 29వ తేది రాత్రి నేను కోడి కునుకు తీస్తునను. కుక్కుట నిద్ర అంటే ఏమిటో మీ అందరికి తెలిసే వుంటుంది. నిద్రపోకుండా, నిద్రపోయే ఒక నిద్ర పేరే కుక్కుట నిద్ర. కళ్లు మూసుకుని దేవుణ్ణే

తలచుకుంటూ విశ్రమించేటప్పుడు ఒక చిన్న అలికిడికే ఉలిక్కిపడి లేస్తుంటాను. ఏ శబ్దం విన్నా, జిత్తులమారి నక్క వచ్చిందో, కాట్ల కుక్క వచ్చిందో, చెండాడే పిల్లి వచ్చిందో అనే భయమే కదా! ఇప్పుడు, నా పడకగది ఎక్కడా? అనే సందేహము రావచ్చు. మహారాష్ట్రలో, లాటూర్ లో ఒక పూరి గుడిసె ప్రక్కన వున్న మట్టి గూడే నా ఇల్లు మరియు పడక గది. ఈ మామూలు కోడికి, అది మహారాష్ట్ర అని, లాటూరు అని ఎలా తెలుసు అని మీకు ఆశ్చర్యం కలుగవచ్చు. కాని ఇవన్నీ తెలియకుండా నా జీవిత చరిత్రలోని ఒక ముఖ్యమైన భాగాన్ని మీకు ఎలా వివరించగలను? నేను ఏది వివరించినా ఎలా వివరించినా అది చరిత్రలో భూగోళ శాస్త్రాలలో నాకున్న పాండిత్యం మూలనయేమో అని. మీరు అపార్థం చేసుకోకూడదు. సినిమాలలోని విచిత్రాలు మనం ఎలా అడగకుండ వుంటామో అలాగే నా వివరణలో కూడ ఎలాంటి ప్రశ్నలకు ప్రశక్తి లేదు అని నేను చెబితే నాకు గణితశాస్త్రంలో ఏమీ తెలియదు అని మీరు అనుకోకూడదు. మేము కోళ్లు ధాన్యపు గింజల్ని, ఒక్కొక్కటే ఏరుకొని ఎందుకు తింటుంటామో మీరు గమనించారా? లెక్కలలో బాగా తెలుసు. మేము దిట్టలం. మాకు ఆహారమంటే గుణకారణము, భాగాహారము మాకు తెలియనే తెలియదు.

ఇంతకూ నేను చెప్పొచ్చేది ఆ రోజు అంటే 29వ తేదీ రాత్రి నేను నా కుక్కుట నిద్రతో కుస్తీ పడుతున్నాననే కదా? అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా మంచి నిద్రరాలేదు కాని. తెల్లవారుఝామున మంచి నిద్రలో వుండేటప్పుడు అది సంభవించింది. ''ఏం సంభవించింది? అని మీరు ఈరోజు అడగటం అంత సమంజసంగా లేదు. ఆ సంఘటన జరిగి ఇప్పటికి కొన్ని రోజులైంది. ఈ ఘోరమైన దుర్ఘటన గురించి లోకమంతా తెలిసిపోయింది. నానా దిశలనుంచి సహాయ, సహకారాలు వాగ్దానాలు మరియు వాగ్దానాలు లేకుండా సత్వర సహాయ సహకరణాలు వచ్చేసినా. దాని తర్వాత కూడా ఏం జరిగింది? అని మీరడిగితే వార్తా పత్రికలు చదివే అలవాటు మీకు లేదన్నమాట.

అది ఎలా జరిగిందో నాకు తెలియదు. ఏదో శబ్దం విని నేను నా అలవాటు ప్రకారం వులిక్కిపడి లేచాను. నా గూడంతా కదులుతుంది. వెంటనే నాకు అర్థమైంది. ఇది ఒక భూకంపమని. మామూలుగా మనుషులకు ఈ విషయం తెలుసుకోవడానికి కొంచెం సమయం పడుతుంది గాని, మృగాలకు, పక్షులకు భూకంపం గురించి కొంచెం ముందుగానే సూచనలు తెలుస్తాయని మానవులకు తెలుసు. కాని నేను మంచి నిద్రలో వుండడం మూలానా, భూకంపం వచ్చిన తర్వాతనే ఆ విషయం నేను గ్రహించగలిగాను. నిద్ర నుంచి నేను అర్ధముక్త అయ్యేసరికి, ముందు నా గూడు గూడ్స్ రైలులో పెట్టారా అని సందేహించాను. మరుక్షణంలో అదొక భూకంపమని నాకు తెలిసిపోయింది. శబ్దాలు ఎక్కువైనాయి. ఇళ్లన్నీ కూలి పడిపోతున్నట్లు అనిపించింది. మా

యజమాని ఇల్లంతా నా గూడుపైనే పడినట్టుగా నాకు అనిపించింది. ఎంతో దట్టమైన చీకటి. నాపైన ఏవో మట్టి పెళ్లలు వచ్చి పడ్డాయి. నా గూడంతా పగిలి, చిందర వందర అయినట్లు అనిపించింది. గూడులో ఒక మూలకున్న నేను ముందుకు వెనకకు మరియు పక్కలకు కదిలి చూశాను. కాని ఏవైపున కూడా కదలటానికి స్థలం లేదు. అంతా ధూళిమయం. పదిహేను నిముషాల పాటు ఏకధాటిగా తుమ్ము లే. ఆ తుమ్ములు కొంచెం తగ్గిన తర్వాత భగవంతుణ్ణి ప్రార్థించాను. ''దీన కుక్కుట బంధో!!! తెల్లవారే సరికి నాకు బయటకు వెళ్లడానికి వీలు కల్పించు. నా యజమాని, ఆయన భార్య పిల్లలు వాళ్లంతా నాకు తినడానికి అప్పుడప్పుడు ఏదో వేసేవారు - వాళ్లకేం అపాయం జరుగకుండా చూడు భగవాన్!!'' ఆ సమయంలో వేరే ఏం చేయడానికి వీలుతోచక, దేవతలలో కోళ్లకు సహాయం చేసిన ఎవరైనా దేవుడున్నాడా అని ఆలోచించాను. దేవగణాలకి ముఖ్యుడైన దేవేంద్రుడు స్వయంగా కుక్కుట వేషం ధరించాడు అని నాకు గుర్తుకు వచ్చేసరికి నాకు కొంచెం సిగ్గుగా అనిపించింది.

అప్పుడు నేను ఆయన ప్రక్కన వుండి వుంటే కెక్కరిస్తూ రెక్కలెత్తి నా చుట్టుపక్కల తిరిగేవాడు అని అనుకున్నప్పుడు నాకు రోమాంచము కలిగింది. కాని రోమములేని నాకు రోమాంచము ఎలా కలుగుతుంది? అయితే నాకు కలిగిన ఆ అనుభూతికి ''తూలికాంచము'' అని చెప్పాలేమో! రోమము గురించి చెప్పేటప్పుడు నాకొక పాత సందేహం నెమరుకు వస్తుంది. పశు పక్షులందు మొగదానికే అందమెక్కువ. కాని ఈ మానవులలో స్త్రీకే అందం ఎక్కువ ఎందుకు పెట్టాడో ఆ భగవంతుడు? ఆడ సింహానికి జూలులేదు. ఆడ నెమలికి రంగు రంగుల పింఛం లేదు. కోడి పెట్టకు కోడి పుంజుకు వున్నట్టు తలపై అలంకారము లేదు. అందమైన తోకా లేదు కాని ఈ మానవులలో ఆడది మాత్రమే అందమైన కురులు పెంచుకుంటుంది. మగవాళ్లకు తొందరగా బట్టతల లేదా నెరవడం త్వరగా వస్తుందని కాబోలు ''ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్'' అని చెప్పినట్టు ముందు చర్యగా, జుట్టు అనే శిరో అలంకారాన్ని ఎంతో హ్రస్వముచేసి పెట్టడమే బుద్ధి అని ఆ బుద్ధిరాక్షసులు భావిస్తున్నారేమో!

తెల్లవారినట్టు నాకనిపించింది. కోడి పుంజు కూయడం వల్లకాదు. అంధకారం నిబిడమైన నా పగిలిపోయిన గూడు లోపలికి ఎక్కడ నుండో ఒక ప్రకాశ శకలం జారిపడుతోంది. కొద్దిగ కూడా కదలడానికి మెదలడానికి స్థలం లేదు. బయటి నుండి ఏవేవో శబ్దాలు వినిపిస్తున్నాయి. నేను కూడా సాధ్యమైనంత ఎక్కువగా శబ్దాలు చేసి చూశాను. ఎవరైనా నా శబ్దాలు విని నన్ను బాహ్యలోకానికి తీసుకువెళతారనీ నాకు నమ్మకం వుండేది. ''సంభవామి దినే దినే'' అని కోడిపెట్టల గురించి చెప్పే విషయం అప్పుడు జరిగింది.

చాలా కష్టపడి నాకు తోడుగ వుండడానికి నేనొక గుడ్డును పెట్టాను. దానిపైనే కూర్చోవడం నాకిష్టం లేకపోవడంతో కొంతసేపు తర్వాత కాలుతో దాన్ని ఒక ప్రక్కకు తోశాను. కళ్లు మూసుకుని ముక్కోటి దేవతలను ప్రార్థించాను. ఎంతోదాహం. ఆకలిగూడా ఎక్కువగా వుంది. కాని ఏం చేయగలను? మళ్లీ రాత్రి అయిందని అనిపించింది. తట్టుకోలేని బలహీనత. మామూలు భయాలు రాకుంటేనే నేను స్పృహకోల్పోయినట్లు నిద్రపోయాను. మళ్లీ తెల్లవారింది. నిన్నటి అనుభవాలే ఈరోజు కూడా. కాని ప్రధానమైన వ్యత్యాసాలు రెండున్నాయి. ఒకటి గ్రుడ్లు పెట్టాలని అనిపించలేదు. దాహంతో ఆకలితో నా వివశత ఇంకా ఎక్కువైంది. భగవంతుణ్ణే ధ్యానిస్తూ నేను ఒంటికాలిపైన తపస్సు చేశాను. ఒంటి కాలుపై నిలబడడం ఏమంత కష్టం కాదు. ఎందుకంటే పడిపోడానికి ఏవైపున కూడా స్థలం లేదు కదా! కాని రెండు కాళ్లలో కూడా ఇపుడు బలం లేకుండా అయింది. దానితో ఇంక పండుకోవడమే. తట్టుకో లేని ఆకలి నా మనసులో ఒక క్రూరమైన ఆలోచనను పుట్టించింది. నిన్న నేను పెట్టిన గ్రుడ్డునే పగలగొట్టి తినేద్దామని. కాని ఆకలితో నేను చచ్చిపోయినాసరే అలాంటి పని చేయనని నిర్ణయించుకున్నాను.

మళ్ళీ రాత్రి అయింది. ఒక మాదిరి ఆ బోధస్థితిలో నేను నిద్రపోయాను. మళ్లీ తెల్లవారడంతో లేచి నిలబడడానికి శక్తి లేదని నాకు అనిపించింది. నా కాళ్లకేమైనా పక్షవాతము వచ్చిందా? కళ్లలో పుసి! ఆ పుసి నుండి విడిపోవడానికి ఇష్టంలేని పై కనురెప్పలు. నేను బ్రతికి వున్నానో లేక చచ్చిపోయానో అన్న సందేహం కలిగింది. కఠినమైన ఆకలి విషయం ప్రక్కన పెడదాం. ఎండిపోయిన నా గొంతులోకి ఎవరైనా ఒక్క చుక్క నీరు పోస్తే ఎంత బాగుండేది? దయామయుడైన ఆ సర్వశక్తుడు ఒక వర్షం కురిపిస్తే నా గూడులోపలికి కూడా ఆ నీరు రావచ్చు. అది ఎక్కువగా వస్తే నేను ఇక్కడ మునిగి చస్తాను. కాని అలా దాహంతో చచ్చేదానికన్నా అలా నీటిలో మునిగి చావడమే మేలు.

బయటి నుండి ఏవేవో శబ్దాలు వినిపిస్తున్నాయి. మనుష్యులు పెద్దగా మాట్లాడుతున్నట్టు వాళ్లు ఏవేవో వస్తువులు లేపుతున్నట్టు నాకర్థమైంది. కళ్లు తెరచి చూద్దామన్నా శక్తిలేదు. భగవంతుణ్ణే దీనాతిదీనంగా మరోమారు వేడుకున్నాను. మనుష్యులు రాళ్లు, రప్పలు తొలగించేటప్పుడు ఏ మాత్రం మట్టి కొంచెం ఎక్కువ పడ్డా నాకిక్కడే సజీవ సమాధి అవుతుంది. అరుద్దామంటే గొంతు పెగలడం లేదు. రానున్నది రాక మానదు అని అనుకొని దేవుడిపై పూర్తి భారాన్ని వుంచి కళ్లు మూసుకుని పడుకున్నాను.

శబ్దాలు క్రమంగా ఎక్కువైనాయి. ఒక్క మారుగా కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతి వచ్చింది. నేను కళ్లు తెరిచాను గాని నాకు ఏం కన్పించలేదు. అంత లోపల ఎవరో నా మెడ పట్టుకొని బయటకు లాగారు. ''ఓహ్! ఇది చచ్చిపోలేదు'' అని అతడు ఎంతో ఆశ్చర్యంగా అన్నాడు. అతడు నన్ను కొంచెం దూరం తీసుకెళ్లి, ఒక ఇంటి

వెనక చిన్న త్రాటితో కట్టివేశాడు. ఎంతమంచి మానవుడు!! ఎంతో దయతో ఒక గిన్నెలో నీళ్లు తీసుకువచ్చి పెట్టి కొన్ని బియ్యపు గింజలు కూడా నాముందు వేశాడు. అతడొక దేవదూతలాగా నాకా సమయంలో అనిపించాడు. సొమ్మసిల్లి పడివున్న నేను అతి కష్టంగా తల కొంచెం పైకి లేపి గిన్నెలోని నీరు కొంచెం చప్పరించాను. తరువాత కొన్ని గింజలు తిన్నాను. మళ్లీ నీళ్లు తాగాను. దానితో పోతూ పోతూ వున్న ప్రాణం తిరిగి వచ్చినట్టనిపించింది. నేను ఇప్పుడు నా కాళ్లపై నిలబడగలను. దైవనిర్ణయం ప్రకారమే అంతా జరుగుతుంది. రెండురోజుల నుండి మట్టిలో కూరుకుపోయి వున్నా గూడా మూడవరోజు ఒక హఠయోగిలాగా ప్రాణంతో బయటకు లేచాను. నేను ఎంతో ఎక్కువగా సంతోషించాను. ఇంకా నా అంతిమ శ్వాసవరకు నేనొక స్వతంత్ర్య జీవిని. రేపటి నుండి నేను ఈ ఊరంతా విచ్చల విడిగా తిరగగలను. రెండు మూడు రోజుల లోపల తిరిగితే గ్రుడ్లు పెట్టే శక్తి కూడా వచ్చేస్తుంది. కోడిపుంజు ముందు కొంచెం ప్రేమ విన్యాసం కూడా మొదలుపెడతాను. అలాగే ఒకరోజు నా చుట్టూ పది పన్నెండుమంది నాపిల్లలు నా చుట్టూ బిలబిలమని తిరుగుతూ వుంటే నాకెంతో గర్వంగా ఉంటుంది.

ఎవరెవరో వస్తున్నారు. పోతున్నారు. నన్ను కాపాడిన మనిషి ఒక నిక్కరు, బనియన్ వేసుకున్నాడు. ఎక్కువమంది అక్కడ ఆ వేషంలోనే వున్నారు. కొంతమంది ప్యాంట్స్ వేసుకున్నారు. ఇంకొంతమంది పంచలు కట్టుకున్నారు. వాళ్లలో ఎక్కువ మంది పోలీసు వాళ్లు అవునో కాదో నాకు అర్థం కావటం లేదు.

సాయంకాలమయింది. తాడు పరిధిలో నేను వ్యాహ్యాళి చేస్తున్నాను. ఇప్పటికి నేను కొంచెం హుషారుగా వున్నాను. ఆ ఇంట్లో ఎవరెవరో వున్నారు. వాళ్లంతా త్రాగటం, తినటం కార్యక్రమంలో నిమగ్నమై వున్నారు.

చటుక్కున ఇది జరిగింది. ఓ కుర్రాడు నా దగ్గరకు వచ్చి రెండు మూడు నిముషాల పాటు చూస్తూ నిలబడ్డాడు. తరువాత తాడులాగి నన్ను పట్టుకున్నాడు. భయమేసి నేను అరవడం, రెక్కలు కొట్టుకోవడం ప్రారంభించాను. అనవసరంగా ఎందుకు నేను భయపడుతున్నాను అని నాలో నేను కొంత సముదాయించుకున్నాను. రెండు రోజులకు పైగా రాళ్లు రప్పల క్రింద వున్న నేను ఇప్పుడు పూర్తి ప్రాణంతో వున్నాను కదా! నా ఆయుష్షుకు ఎలాంటి అపాయం కలుగదని మళ్లీ మళ్లీ అనుకొని నా చిన్ని ముక్కుద్వారా నేను నిట్టూర్చాను.

కాని నన్ను చేతిలోకి తీసుకున్న ఆ మనిషి నవ్వు, ముఖభావం చూస్తే అతడొక దుర్మార్గుడి మాదిరే కనిపించాడు. అతడు తన మిత్రులతో ఆరాత్రి భోజనం గురించి పెద్దగా నవ్వుకొని చెబుతున్నట్టు నేను విన్నాను.

అయ్యయ్యో. ఇతడెందుకు నామెడ గట్టిగా నొక్కుతున్నాడు. చంపడానికి ఇతని చేతిలో కత్తి లాంటిది ఏమీ లేదే. ఒకవేళ చంపాలంటే ఏదో మంత్రం చెబుతూ మెల్లమెల్లగా నా కుత్తుక కోయకుండా ఒకే దెబ్బతో తెగేస్తే బాగుంటుంది.

తన రెండు కాళ్ల మధ్య నన్ను నొక్కిపట్టి రెండు చేతుల వేళ్లతో నాగొంతు నులిమేస్తున్నాడే - నాకు ఏమి కనిపించడం లేదు. అయ్యో, నాకు ఊపిరి ఆడడం లేదు. నా తలను తిప్పుతున్నాడా. అబ్బో, ఎంత నొప్పి. అబ్బా! ఊపిరి ఆడడం లేదు. నా కళ్లు బయటకు పొడుచుకు వస్తున్నాయి. నా నాలిక కూడ బయటకొచ్చింది. చీకటి, చీకటి.

*   *   *

ఎంతో భీభత్సమయిన భూకంపం సాధించలేని విషయాన్ని ఈ చిన్న మనిషి ఎంత సులువుగా సాధించాడు!!

---